# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 88

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్

**ప్రధాని జన్మదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం**

**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ**

**రక్తదానం గొప్ప మానవతా సేవ అన్న గవర్నర్**

**దాతలను సత్కరించి ప్రశంసా పత్రాల అందజేత**

హైదరాబాద్, సెప్టెంబర్ 17: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తరువాయి 2 వ పేజీలో..

## ఫామ్‌హౌస్ లెక్కలు తీయాలె.. ఎర్రవల్లిలో రెవెన్యూ టీమ్ హడావుడి!

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు**

**కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు**

**సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా**

**సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ**



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు.ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అమరుల త్యాగాలకు గౌరవ వందనం

**అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి**

**ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కార్యక్రమం**

**గన్ పార్క్ వద్ద ఘన నివాళులు.. ఉద్యమ స్ఫూర్తి స్మరణ**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 17: తెలంగాణ ఉద్యమ చరిత్రలో అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వారి పోరాట ఫలితంగానే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాయని తెలిపా రు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచే స్తోందని చెప్పారు. ప్రజా పాలన దినోత్సవం తరువాయి 2 వ పేజీలో..




## మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

**మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్**

**కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్**

**కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం**

**మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్**



## పాఠశాలలను సందర్శించిన భట్టి విక్రమార్క

**ఆప్యాయంగా ముచ్చటించిన ఉప ముఖ్యమంత్రి**

**విద్యా ప్రమాణాలు, వసతులపై విద్యార్థులతో ఆరా**

ఖమ్మం, సెప్టెంబర్ 17 : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనం వారి కృష్ణాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పాఠశాలలో విద్యా పరిస్థితులు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత తరువాయి 2 వ పేజీలో..

## సెప్టెంబరు 17 చరిత్రకు మతం రంగు పులిమే ప్రయత్నం

**సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత తెలంగాణ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి**




## కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ జరపాలి

**కేసీఆర్ కుటుంబానికి చెందిన భూములపై విచారణ జరపాలని మహేశ్ గౌడ్ డిమాండ్ 2009లో భూమిలేని కేసీఆర్‌కు ఇప్పుడు వందల ఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్న అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవానికి పొంతన లేదని ఆరోపణ బీఆర్ఎస్ నేతల భాష, ప్రవర్తనపై తీవ్ర విమర్శలు**







## తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల తేదీలు ఇవే!

**తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల నవంబర్ 29న ఎస్ఐ, డిసెంబర్ 20న కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష మొత్తం 7,437 పోస్టులకు 5.77 లక్షలకు పైగా దరఖాస్తులు ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌కు సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగింపు పాత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై దృష్టి పెట్టాలని అభ్యర్థులకు సూచన**

## యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు దారుణ హత్య!




**కొబ్బరికాయల కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి.**

**పాత కక్షలే కారణమా..?**

**భార్య వైష్ణవి హత్య కేసులో నిందితుడైన హరిబాబుపై ప్రతీకార దాడి అని పోలీసుల అనుమానం.**



వేగుచుక్క

# మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు.కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు.కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

# సెప్టెంబరు 17 చరిత్రకు మతం రంగు పులిమే ప్రయత్నం జరుగుతోంది: కవిత

తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. అయితే ఈ చారిత్రక రోజును కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నాయని విమర్శించారు.తెలంగాణ విలీనానికి స్టేట్ కాంగ్రెస్ పోరాటమే కారణమని సీఎం చెబుతున్నారని, అది వాస్తవం కాదని కవిత అన్నారు. సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని అప్పట్లో మహాత్మా గాంధీ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిజాం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని భారత యూనియన్‌లో విలీనం తర్వాత కాంగ్రెస్ తిరిగి జమీందార్లకు అప్పగించిందని ఆరోపించారు.బీజేపీ తీరుపైనా కవిత మండిపడ్డారు. ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా ఆనాటి చరిత్రకు మతం రంగు పులిమేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ పోరాటం జరిగిన సమయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉనికిలోనే లేవని అన్నారు.జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాటం చేశారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి వారు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని గుర్తుచేశారు.కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినుద్దీన్ వంటి కవులు, రచయితలు తమ రచనలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని చెప్పారు. వారి స్ఫూర్తితో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి వారు పోరాటంలో ముందుకు వచ్చారని పేర్కొన్నారు.అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన కూడా కులమతాలకు అతీతంగా ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని కవిత అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.?

# కేటీఆర్ సిబ్బంది విచారణ: సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచండి.. పోలీసులకు హైకోర్టు ఆదేశం

**పోలీస్ స్టేషన్‌లో తమపై దాడికి యత్నించారని కేటీఆర్ సిబ్బంది ఆరోపణ తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు నోటీసులు**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైఫాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. ఓ కార్యక్రమానికి డీజే అనుమతి కోసం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇప్పటికే ఫిర్యాదు నమోదైందని కోర్టుకు వివరించారు.ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పిటిషనర్లు తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హోం సెక్రటరీ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఖైరతాబాద్ ఏసీపీలకు నోటీసులు జారీ చేసింది.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్



మొదటి పేజీ తరువాయి

గవర్నర్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. సమాజంలో సేవా కార్యక్రమాల పట్ల మరింత చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రక్తదానం మానవతా సేవలో అత్యంత గొప్పదైన సేవలో ఒకటని గవర్నర్ అన్నారు. వైద్య శాస్త్రం ఎన్నో రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయం ఇప్పటికీ అందుబాటులో లేదని గుర్తుచేశారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, వివిధ వ్యాధుల చికిత్స సమయంలో రక్తం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అందువల్ల ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభిస్తుందని గవర్నర్ తెలిపారు. సమాజంలో స్వచ్ఛంద రక్తదాన సంస్కృతి మరింత విస్తరించాల్సిన అవసరం ఉదన్నారు. యువత ముఖ్యంగా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో రక్త నిల్వలను పెంచి అవసరమైన వారికి సకాలంలో అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారిని సత్కరించి పండ్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సమాజానికి సేవ చేస్తున్న దాతలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. రక్తదానంతో ఎన్నో ప్రాణాలకు ఆశాకిరణంగా మారుతున్నారని అన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని అన్నారు. రక్తదాన శిబిరాల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అవసరమైన రక్తం అందుబాటులో ఉండే అవకాశం పెరుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం సేవా భావనను ప్రతిబింబించిందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ప్రజలు పెద్ద సంఖ్యలో రక్తదానానికి ముందుకు వచ్చి మరింత మంది ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, స్వచ్ఛంద దాతలు పాల్గొన్నారు. రక్తదాన శిబిరం విజయవంతంగా కొనసాగగా, సేవా కార్యక్రమాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని నిర్వాహకులు తెలిపారు.

# అమరుల త్యాగాలకు గౌరవ వందనం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ చరిత్రలో ప్రత్యేకమైన రోజని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కుల పరిరక్షణకు ఈ రోజు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అమరవీరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని అన్నారు. గన్ పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.



అమరవీరుల కుటుంబాల త్యాగాలను రాష్ట్రం ఎప్పటికీ మరువదని ముఖ్యమంత్రి అన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని పిలుపునిచ్చారు. ప్రజా పాలన దినోత్సవ వేడుకలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి కొనసాగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణను మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# వేగంగా పోలవరం పనులు

**పోలవరం, సెప్టెంబర్ 17 :**

నిర్మాణ ప్రక్రియలో అవసరమైన సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని మంత్రి సూచించారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి రంగాలకు గణనీయమైన ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా రూ.536 కోట్ల వ్యయంతో కుడి, ఎడమ గట్ల అనుసంధాన పనులు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. భారీ స్థాయిలో జరుగుతున్న ఈ పనులు ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భాగమని వివరించారు. నిర్మాణ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు కొనసాగించాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భూసేకరణ, పునరావాస కార్యక్రమాలపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. 2024 జూన్ తర్వాత 10,491 ఎకరాల భూమిని సేకరించినట్లు అధికారులు వివరించారు. నిర్వాసితులకు రూ.2,250 కోట్ల పరిహారం అందించినట్లు తెలిపారు. పునరావాస కార్యక్రమాలు సక్రమంగా అమలు అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణం, భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

# సెమికాన్ ఇండియా 2026కు మోదీ శ్రీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీ లో సెమికాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక నిపుణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ, దేశాన్ని ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. సాంకేతిక రంగ భవిష్యత్తును నిర్దేశించే వేదికగా సెమికాన్ ఇండియా నిలుస్తోందన్నారు. సెమికాన్ ఇండియా కార్యక్రమం 2022లో ప్రారంభమైనప్పటి నుంచి సాధించిన పురోగతిని మోదీ వివరించారు. ప్రారంభ దశలో విధానాల రూపకల్పనతో మొదలైన ప్రయాణం, అనంతరం ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రయోగాత్మక ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, ప్రస్తుతం వాణిజ్య ఉత్పత్తి దశకు చేరుకుందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ తయారీకి అవసరమైన పునాదులు వేగంగా బలపడుతున్నాయని పేర్కొన్నారు. ఇది భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. సెమీకండక్టర్ వ్యవస్థ నిర్మాణం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చిప్ రూపకల్పన, తయారీ పరికరాల అభివృద్ధి, పరీక్షా సామర్థ్యాల నిర్మాణం వంటి అంశాల్లో అనేక రంగాల సమన్వయం అవసరమని చెప్పారు. తక్కువ సమయంలో ఈ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు చేసిన కృషిని అభినందించారు. ఈ సహకా రంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోందన్నారు. దేశీయ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మోదీ నొక్కి చెప్పారు.

# పాఠశాలలను సందర్శించిన భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, పాఠశాల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా అత్యుత్తమ విద్యా అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న ఉదయం అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకాలపై భట్టి విక్రమార్క విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, పరిమాణం గురించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం రుచికరంగా, నాణ్యంగా అందుతున్నాయని విద్యార్థులు తెలిపినట్లు సమాచారం. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసం మెరుగుపడుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి కొరత ఉందని విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన భట్టి విక్రమార్క గణిత ఉపాధ్యాయుడిని నియమించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో బోధనా సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధిర నియోజకవర్గంలో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పనులపై ఉప ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, భూ సేకరణ, నిర్మాణ ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన విద్యా సంస్థలను అందుబా టులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. వి ద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికా రులను ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణ పనులు నవంబర్ మొదటి వారంలోగా ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాల ని భట్టి విక్రమార్క అధికారులకు స్పష్టమైన ఆదేశా లు జారీ చేశారు. పనుల్లో జాప్యం లేకుండా సమ యపాలనతో ముందుకు సాగాలని సూచించారు.

# కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ జరపాలి: మహేశ్ గౌడ్

**కేసీఆర్ కుటుంబానికి చెందిన భూములపై విచారణ జరపాలని మహేశ్ గౌడ్ డిమాండ్**

**2009లో భూమిలేని కేసీఆర్‌కు ఇప్పుడు వందల ఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్న**

**అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవానికి పొంతన లేదని ఆరోపణ**

**బీఆర్ఎస్ నేతల భాష, ప్రవర్తనపై తీవ్ర విమర్శలు**




మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ ఆస్తులపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబానికి అంతటి భారీ స్థాయిలో భూములు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.

కేసీఆర్ కుటుంబానికి చెందిన భూముల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే బహిర్గతం చేశారని మహేశ్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 2009లో కేసీఆర్‌కు ఎలాంటి భూమి లేదని, 2014 నాటికి 35 ఎకరాలు ఉండగా, 2018 నాటికి ఆ విస్తీర్ణం మరింత పెరిగిందని తెలిపారు. 2023 నాటికి కేసీఆర్ పేరిట 53 ఎకరాలు ఉండగా, కేటీఆర్ మరో 67 ఎకరాలు కొనుగోలు చేశారని వివరించారు. మొత్తంగా 2023 నాటికే ఆ కుటుంబం పేరిట 123 ఎకరాలు భూమి ఉందని పేర్కొన్నారు. అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవాలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. భూములకు సంబంధించిన "22ఏ" వివాదంపై కూడా ప్రస్తుతం విచారణ జరుగుతోందని వెల్లడించారు.ఇదే క్రమంలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి వారు వాడిన అనుచిత భాషను, పోలీసుల పట్ల వారి ప్రవర్తనను తీవ్రంగా తప్పుపట్టారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను ఆయన ఖండించారు. వీడియోలను పరిశీలిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉద్దేశపూర్వకంగా దూకుడుగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోందన్నారు.

వేగుచుక్క

# ప్రజల కోసమే ప్రధాని మోదీ జీవితం

### అన్ని రంగాల్లో దేశం ముందుకు..

### ఆశీర్వాద దీపం కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ప్రజల కోసమే ప్రధాని నరేంద్ర మోడీ తన జీవితాన్ని అంకితం చేశారని, నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని రైల్వే స్టేషన్ ముందు ఆశీర్వాద దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 13 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా, 12 సంవత్సరాలు దేశ ప్రధానిగా సేవలందిస్తూ దేశ ఔన్నత్యాన్ని చాటుతున్నారన్నారు. ప్రపంచంలో భారత్ ను విశ్వ గురువుగా నిలబెడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ 55 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో అంతకు రెట్టింపు జరిగిందన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాలకు సమన్యాయం చేస్తూ దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థలో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆశీర్వాద దీపం వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, శ్రావణ్ కుమార్, బంటు ప్రీతి, జ్యోతి, ఎర్రం సుధీర్, మల్కాయి మహేందర్, బట్టు రాఘవేందర్, పంచరెడ్డి అనిత, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, నాయకులు మల్లేష్ యాదవ్, బంటు ప్రవీణ్, ఇప్పకాయల కిషోర్, మురళి, మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధుల గుట్టను సందర్శించిన వేముల వీరేశం.

- సిద్ధేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ప్రభుత్వ విఫ్, నకిరేకల్ ఎమ్మెల్యే .





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ నవనాథ సిద్ధేశ్వర దేవాలయాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభుత్వ విప్ కి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని వేముల వీరేశం ఆకాంక్షించారు.

# దివ్యాంగులకు సానుభూతి కాదు..
# ఆత్మగౌరవం, సాధికారత కల్పించాలి.





### రూ.2.10 కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు 1,000 మంది లబ్ధిదారులకు ప్రయోజనం

### కేంద్ర మంత్రి డా. వీరేంద్ర కుమార్‌కు ఎంపీ అర్వింద్ ధర్మపురి కృతజ్ఞతలు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్: సెప్టెంబర్ 17**

సేవా దినంగా భావిస్తూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జీ జన్మదినాన్ని పురస్కరించుకుని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయక పరికరాలు అందించడం ఎంతో అర్థవంతమైన కార్యక్రమమని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దివ్యాంగులకు సానుభూతి కాదు.. అవకాశాలు, అందుబాటు, గౌరవం, సాధికారత అవసరమని ఎంపీ స్పష్టం చేశారు. సహాయక పరికరాలు వారి స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి సాధనాలని పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ. 2.10 కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు 1,000 మంది దివ్యాంగులు, వయోవృద్ధులకు వివిధ రకాల సహాయక పరికరాలు అందించడం ద్వారా ప్రయోజనం చేకూరనుందని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో 19 రకాల సహాయక పరికరాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్ కు ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సహాయం మరింత చేరువ అవుతోందన్నారు. నిజామాబాద్ నార్త్, ఆర్మూర్, బోధన్, జగిత్యాల కోరుట్ల ప్రాంతాల్లో ఇప్పటికే సుమారు 1000 మంది దివ్యాంగులను గుర్తించామని, మిగిలిన అర్హుల గుర్తింపు ప్రక్రియను కూడా కొనసాగిస్తామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉన్న అర్హులెవరూ ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్రవంతి రెడ్డి గారు, ప్రమోద్, కార్పొరేటర్లు నాగొల్ల లక్ష్మీనారాయణ, వైష్ణవి సుధా, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, మహిళా శిశు వికలాంగుల శాఖ జిల్లా అధికారి సౌందర్య, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు దారుణ హత్య!

### కొబ్బరికాయల కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి.

### పాత కక్షలే కారణమా..?

### భార్య వైష్ణవి హత్య కేసులో నిందితుడైన హరిబాబుపై ప్రతీకార దాడి అని పోలీసుల అనుమానం.



**నిజామాబాద్,సెప్టెంబర్:17**



సంచలనం సృష్టించిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఆమె భర్త చిత్తారి హరిబాబు దారుణ హత్యకు గురయ్యాడు. నిజామాబాద్ నగరంలోని రాజారాజేంద్ర చౌరస్తా వద్ద ఉన్న ఓ మల్టీప్లెక్స్ థియేటర్ సమీపంలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గురువారం సాయంత్రం థియేటర్ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ వద్దకు ముగ్గురు అపరిచిత వ్యక్తులు వచ్చారు. అక్కడ ఉన్న హరిబాబుపై ఒక్కసారిగా కొబ్బరికాయలు కోసే వేటకత్తులతో దాడికి తెగబడ్డారు. నడిరోడ్డుపైనే దారుణంగా నరకడంతో తీవ్ర రక్తస్రావమై హరిబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న వెంటనే నిజామాబాద్ రెండో టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏసీపీ ప్రకాశ్ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గతంలో నాలుగు నెలల గర్భవతిగా ఉన్న తన భార్య యూట్యూబర్ వైష్ణవి ని హరిబాబు దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. ఆ పాత కక్షలను మనసులో ఉంచుకునే ప్రత్యర్థులు ప్రతీకారంతో పథకం ప్రకారం ఈ హత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరుపుతున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి.

















### డిఇఓ అశోక్ కుమార్. నలందలో అంబరాన్నంటిన మండల స్థాయి క్రీడా ముగింపు వేడుకలు.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

పట్టణంలోని మామిడిపల్లిలో ఉన్న నలంద హైస్కూల్‌లో 70వ ఆర్మూర్ అర్బన్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి పి. అశోక్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. 70వ ఆర్మూర్ అర్బన్ మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన నలంద హైస్కూల్ యాజమాన్యాన్ని డిఇఓ పి. అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన వివిధ పాఠశాలల విద్యార్థులను అభినందించారు. అలాగే పోటీలకు సహకరించిన అన్ని పాఠశాలల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ అర్బన్ మండల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే అమరవీరులకు నిజమైన నివాళి.

- సత్యశోధక్ పాఠశాలలో తెలంగాణ ప్రజా పాలన మరియు జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలకు చిరస్మరణీయ ప్రతీక అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాల ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం తెలంగాణ ప్రజలు సాగించిన మహోన్నత పోరాటం చరిత్రలో స్ఫూర్తిదాయక అధ్యాయమన్నారు. నిరంకుశ పాలనలో అనేక అణచివేతలను ఎదుర్కొన్నప్పటికీ, ప్రజలు చూపిన ధైర్యం, ఐక్యత, త్యాగం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం కేవలం పాలనా విధానం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి హక్కులు, బాధ్యతలు, సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యతల సమాహారమని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు బలపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, యువత చైతన్యంతో, బాధ్యతతో వ్యవహరించినప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని తెలిపారు.



తెలంగాణ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను నెరవేర్చేందుకు ఐక్యతను బలోపేతం చేయడం, శాంతి సౌభ్రాతృత్వాలను పెంపొందించడం, సమానత్వాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే అమరవీరులకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగుచుక్క



# చిరంజీవి సరసన స్నేహా.. 'కాకా'లో కీలక పాత్ర?

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా' చిత్రంపై టాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. అప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సీనియర్ నటి స్నేహ ఈ సినిమాలో చిరంజీవి సరసన నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం 'కాకా'లో స్నేహ చిరంజీవి భార్య పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో స్నేహ మాట్లాడుతూ.. తన కెరీర్‌లో చిరంజీవితో కలిసి ఒక్కసారైనా నటించాలనేది తన కోరిక అని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె సెకండ్ ఇన్నింగ్స్‌లో ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర కూడా విభిన్నంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆక్వా పరిశ్రమలో సాధారణ సూపర్‌వైజర్‌గా 'కె. సత్యం' అనే పాత్రలో ఆయన కనిపించనున్నట్లు సమాచారం. బయటకు ప్రశాంతంగా, సాధారణంగా కనిపించే ఈ పాత్ర వెనుక బలమైన భావోద్వేగ నేపథ్యం ఉన్నట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది. మలయాళ యువ నటి అనస్వర రాజన్ ఈ చిత్రంలో 'అమ్ములు పాప' అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. కథను మలుపుతిప్పే పాత్రగా దీనిని చిత్రబృందం పేర్కొన్నట్లు సమాచారం. కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. స్నేహ పాత్రపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# ప్రమాదం తర్వాత పండు మాస్టర్ కీలక నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

బుల్లితెరపై తనదైన డ్యాన్స్, కామెడీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'ఢీ' ఫేమ్ పండు మాస్టర్ ప్రస్తుతం తీవ్ర గాయాలతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం కదల్లేని పరిస్థితిలో మంచంపైనే ఉంటూ చికిత్స తీసు కుంటున్నారు. పూర్తిగా కోలుకుని మళ్లీ డ్యాన్స్ చేయడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ప్రమాదం కారణంగా పండు మాస్టర్ కొంతకాలం స్టేజ్ షోలు, టెలివిజన్ కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. సాధారణంగా కళాకారులకు కార్యక్రమాలు, ప్రాజెక్టుల ద్వారా ఆదాయం వస్తుంటుం ది. అయితే ప్రస్తుతం పనుల కు వెళ్లే పరిస్థితి లేకపోవ డంతో ఆయన తన కెరీర్‌ను కొనసా గించేందుకు మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఇప్పటివరకు



సామాజిక మాధ్యమాల ద్వారా అ భిమానులతో అనుసంధానంగా ఉన్న పండు మా స్టర్.. ఇకపై సొంతంగా ప్రారంభించినయూ ట్యూబ్ ఛానెల్ ద్వారా తన ప్రయాణాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు.

# కత్రినా కైఫ్‌కు ట్రోలింగ్.. అండగా నిలిచిన సహ నటులు

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ప్రసవం తర్వాత తన శరీరాకృతిలో వచ్చిన మార్పుల కారణంగా సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఇటీవల ఆమెకు సంబంధించిన కొన్ని ఫొటోలు వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. అయితే కత్రినాకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. నటుడు విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకున్న కత్రినా.. కుమారుడు విహాన్ జన్మించిన తర్వాత బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల అంబానీ కుటుంబం నిర్వహించిన గణేశ్ ఉత్సవాలకు హాజరైన సందర్భంగా తీసిన ఆమె ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఫొటోల ఆధారంగా కొందరు ఆమె రూపంపై వ్యాఖ్యలు చేయడంతో వివాదం మొదలైంది. కత్రినాతో 'మేరే బ్రదర్ కీ దుల్హన్' చిత్రంలో కలిసి నటించిన పాకిస్థానీ నటుడు అలీ జాఫర్ ఈ ట్రోలింగ్‌పై స్పందించారు. మహిళల పట్ల పురుషులు తమ దృక్పథాన్ని మార్చుకోవాలని సూచిస్తూ.. కత్రినాను ఆమె జీవితాన్ని ప్రశాంతంగా గడపనివ్వాలని ట్రోలర్లకు హితవు పలికారు. నటి శివలీక ఒబెరాయ్ కూడా కత్రినాకు మద్దతుగా స్పందిస్తూ, మాతృత్వం తర్వాత శరీరంలో మార్పులు సహజమేనని పేర్కొన్నారు. నటి అలియా భట్ సైతం కత్రినా తాజా ఫొటోలను ఇష్టపడటం ద్వారా తన మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో మహిళా నటుల శరీరాకృతి, అందంపై సామాజిక మాధ్యమాల్లో ఉండే అంచనాలు, ప్రసవం తర్వాత మహిళలపై వచ్చే వ్యాఖ్యలపై మరోసారి చర్చ మొదలైంది. అయితే తనపై వస్తున్న విమర్శలపై కత్రినా కైఫ్ ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ప్రస్తుతం ఆమె కుటుంబంతో సమయం గడుపుతూ, తన వ్యక్తిగత వ్యాపార కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.



# సంక్రాంతికి 'కాక'.. విడుదల తేదీ ఖరారు




హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ (కేఎస్ రవీంద్ర) కలయికలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాక' విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో సినిమా విడుదలపై ఇప్పటివరకు కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, బాబీ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిరంజీవి మాస్ ఇమేజ్‌కు అనుగుణంగా భారీ యాక్షన్ అంశాలతో పాటు వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ దర్శకుడు బాబీ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ నారాయణ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణకు సంబంధించిన పలు అప్‌డేట్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన తొలి పాటను త్వరలోనే విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సంక్రాంతి బరిలో జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్న 'కాక'పై మెగాస్టార్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీని అధికారికంగా ప్రకటించడంతో ఇక సినిమా ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.



# ఆ పాట చిత్రీకరణలో కన్నీళ్లు పెట్టుకున్న తమన్నా

హైదరాబాద్, సెప్టెంబరు 17 ::

అగ్ర కథానాయిక తమన్నా నటిస్తున్న తాజా చిత్రం 'ది వివాన్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సిద్ధార్థ్ మల్హోత్రా కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇటీవల విడుదలైంది. అడవి నేపథ్యంలో సాగే మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఛఠ్ పూజ నేపథ్యంలో చిత్రీకరించిన ఓ పాట తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకమైనదని తమన్నా తెలిపింది. ముంబయిలో పుట్టి పెరిగిన తనకు జుహూ బీచ్‌లో వేలాది మంది మహిళలు ఛఠ్ పూజ నిర్వహించడం గతంలో కనిపించేదని ఆమె గుర్తుచేసుకుంది. అయితే ఆ సంప్రదాయం వెనుక ఉన్న విశేషాలు తనకు అప్పట్లో తెలియవని చెప్పింది. సినిమా కోసం ఆ పూజకు సంబంధించిన పాటను చిత్రీకరిస్తున్న సమయంలో దాని ప్రత్యేకత, భక్తిశ్రద్ధలు తనకు అర్థమయ్యాయని తమన్నా పేర్కొంది. దాదాపు 36 గంటల పాటు నీటిని కూడా తీసుకోకుండా మహిళలు భక్తితో ఛఠ్ పూజలో పాల్గొంటారని, బీహారీ సంస్కృతిలో ఈ పూజకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపింది. ఉదయించే సూర్యుడిని పూజించడంతో పాటు అస్తమించే సూర్యుడికి కూడా సమానమైన ప్రాధాన్యత ఇవ్వడం తనను ఆకట్టుకుందని చెప్పింది. పాట చిత్రీకరణ సమయంలో తాను భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయని తమన్నా తెలిపింది. ఏదో అతీతమైన శక్తి తనలోకి ప్రవేశించిన అనుభూతి కలిగిందని, ఆ పాట తన హృదయాన్ని కదిలించిందని పేర్కొంది. 'ది వివాన్'లోని ఈ పాట ప్రేక్షకులకు కూడా ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం భావిస్తోంది.